RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 200 | ఆగస్టు 20 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 200 | August 20 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


**టెన్త్ విద్యార్థుల ఘాతుకం..**

**ప్రిన్సిపాల్‌పై 27 సార్లు కత్తిపోట్లు**

2

## నీట్ లీక్‌పై సుప్రీం విచారణ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారంతో పాటు జాతీయ పరీక్షల సంస్థ లో చేపట్టాల్సిన సంస్కరణలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తూ, దేశంలో ప్రధాన పరీక్షల నిర్వహణలో తాత్కాలిక పరిష్కారాలు కాకుండా పటిష్టమైన, శాశ్వతమైన మరియు సమగ్రమైన వ్యవస్థాగత సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.
ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత మార్పులు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, సైబర్ భద్రత వంటి అంశాలపై సమగ్ర వివరాలతో పూర్తిస్థాయి అఫిడవిట్ సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్‌టీఏలో జరిగే సంస్కరణల ప్రక్రియను తామే స్వయంగా పర్యవేక్షిస్తామని తేల్చిచెప్పిన ధర్మాసనం, నీట్ పరీక్షల భద్రతను పర్యవేక్షించేందుకు ఒక శాశ్వత కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు, ఈ పరీక్షల విశ్వసనీయత కాపాడటమే ధ్యేయంగా సంస్థాగత బలోపేతానికి శ్రీకారం చుట్టాలని స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్షల రద్దు వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే సుప్రీంకోర్టు ఈ శాశ్వత సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించింది.

## ప్రతీ రైతుకూ సకాలంలో

# రుణాలు అందాలి




**హైదరాబాద్ జనసంఘర్షణ**

బ్యాంకింగ్ సేవలను సులభతరం చేస్తూ అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే నేరుగా రైతుల వద్దకు వెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్బీసీ) సమావేశంలో మాట్లాడిన ఆయన, కేవలం రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయాన్ని పెంచేలా బ్యాంకులు కీలక భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి సంబంధించి 2026 జూన్ నాటికి రూ.52,337 కోట్ల రుణాలను అందించినట్లు తెలిపిన డిప్యూటీ సీఎం, డెయిరీ, మత్స్య, ఉద్యానవన, పామాయిల్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాలకు రుణ మంజూరును మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా రుణాలు చెల్లించలేకపోతున్న రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, వారికి తగిన పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో ఎంఎస్ఎంఈ (మీవీజు) రంగానికి సకాలంలో నిధులు అందజేయడం ప్రాధాన్య అంశమని, రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలను ఇప్పటికే ఆమోదించినట్లు వెల్లడించారు.

➤ మిగతా 2వ పేజిలో..

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు



**గరుడధాత్రి జనసంఘర్షణ**

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. ఈ వారం ఆరంభం నుంచే పసిడి ధరలు రోజువారీగా ఒక మోస్తరు స్థాయిలో పెరుగుతూ వస్తున్నాయి. అమెరికాలోని ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చన్న అంచనాలు, అలాగే పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడి సాధనంగా ఉన్న బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. గుడ్ రిటర్న్స్ అందించిన వివరాల ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,900కు చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910 వద్ద కొనసాగుతోంది.

## మహాబలిపురంలో సీఎంల సమావేశం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన దక్షిణ ప్రాంతీయ మండలి 31వ సమావేశం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ముఖ్యమంత్రులు హాజరయ్యే ఈ కీలక భేటీకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు అత్యంత కీలకమైన అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు సీఎం సమాయత్తమయ్యారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని పెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్రం తక్షణమే చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేయనున్నారు. చట్టంలోని షెడ్యూల్ 9, 10 పరిధిలోకి వచ్చే ఉమ్మడి సంస్థల విభజనతో పాటు ఆస్తులు, అప్పుల పంపకం, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అంశాలు, రెవెన్యూ లోటు (గ్యాప్) మరియు పన్ను సంబంధిత సమస్యలను హోంశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. వీటితో పాటు దుగరాజుపట్నం పోర్టు నిర్మాణం, విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు, అలాగే విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్ర సహాయ సహకారాలను కోరనున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, రైల్వే మరియు విమానాశ్రయాల కనెక్టివిటీ విస్తరణపై కూడా చంద్రబాబు చర్చించనున్నారు.

➤ మిగతా 2వ పేజిలో..

## ఫోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు

**ప్రలోభపెట్టి వ్యభిచార రొంపిలోకి దింపిన వైనం**

- ఐదుగురు ప్రధాన దోషులకు జీవిత ఖైదు
- ముగ్గురికి 14 ఏళ్ల జైలు
- 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్‌లోని నాంపల్లి పోక్సో ప్రత్యేక కోర్టు మైనర్ బాలికలను ప్రలోభపెట్టి వ్యభిచార రొంపిలోకి దింపిన కేసులో సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న ముఠాకు చెందిన 33 మందిని దోషులుగా నిర్ధారిస్తూ న్యాయస్థానం కఠిన శిక్షలు ఖరారు చేసింది. 2015లో సీఐడీ నమోదు చేసిన ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని ప్రలోభాలకు గురిచేసి ఈ అక్రమ రవాణాకు ఒడిగట్టినట్లు దర్యాప్తులో తేలింది. సుదీర్ఘకాలం సాగిన విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం న్యాయమూర్తి తీర్పును ప్రకటించారు. ఈ నేరంలో పాల్గొన్న ఐదుగురు ప్రధాన దోషులకు జీవిత ఖైదు విధించగా, మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఆదేశాలు ఇచ్చారు. మిగిలిన దోషులకు కూడా కేసులో వారి పాత్రను బట్టి శిక్షలు ఖరారు చేశారు.
దీంతో పాటు, ఈ కేసులో బాధితులైన తొమ్మిది మంది బాలికలకు పునరావాసం మరియు సాయం కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. మైనర్ల భద్రత, రక్షణ విషయంలో నాంపల్లి పోక్సో కోర్టు వెలువరించిన ఈ కఠిన తీర్పు సమాజంలో క్రిమినల్ ముఠాలకు బలమైన హెచ్చరికగా నిలిచింది.

## అగ్ని ప్రమాదంలో 9 మంది మృతి

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

కోల్‌కతాలోని న్యూమార్కెట్ సమీపంలో ఉన్న మీర్జా గాలిబ్ (ఫ్రీ స్కూల్) వీధిలోని ఒక హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో హోటల్‌లో ఉన్నవారు తీవ్ర భయాందోళనకు గురై బయటకు పరుగుతీశారు. దట్టమైన పొగ చుట్టుముట్టడంతో పలువురు లోపలే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు



➤ మిగతా 2వ పేజిలో..

# ప్రతీ రైతుకూ సకాలంలో రుణాలు అందాలి

**మొదటి పేజీ తరువాయి..** వ్యాపారులను అనవసర పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టకూడదని తేల్చిచెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని, 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు 19.13 లక్షల జనధన్ ఖాతాలు జీరో బ్యాలెన్స్‌తో ఉన్నాయని గుర్తుచేస్తూ, ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు సజావుగా అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలంగా మార్చాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.

# టెన్త్ విద్యార్థుల ఘాతుకం..

## ప్రిన్సిపాల్ రూపారెడ్డిపై 27 సార్లు కత్తిపోట్లు

## వివరాలు వెల్లడించిన నల్గొండ ఎస్పీ

**నల్గొండ**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె. రూపారెడ్డి హత్య కేసులో తీవ్ర దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. జల్సాలకు అలవాటుపడి, డబ్బుల కోసం ఆ పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. ఈ ఘటనలో విద్యార్థుల పాత్ర బయటపడటంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాఠశాలలో ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో భారీగా నగదు ఉంటుందని భావించిన నిందితులు, ఐదు రోజుల ముందే చోరీకి ప్లాన్ చేసుకున్నారు. ఈ నెల 11న మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటికి వెళ్లిన విద్యార్థుల్లో ఒకడు గోడదూకి లోపలికి ప్రవేశించాడు. ఇంట్లోకి వెళ్లిన విద్యార్థి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా ఆమె ప్రతిఘటించారు. ఈ క్రమంలో నిందితుడి మాస్క్ ఊడిపోవడంతో ప్రిన్సిపల్ అతడిని గుర్తుపట్టి కేకలు వేశారు. గుర్తుపట్టారనే భయంతో నిందితుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెను 27 సార్లు దారుణంగా పొడిచి హత్య చేశాడు. అనంతరం ఇంట్లోని నగదు, ఆమె మొబైల్ ఫోన్ తీసుకుని పరారయ్యాడు. బయట కాపలా ఉన్న మరో విద్యార్థికి అందులో నుంచి రూ.40 వేలు ఇచ్చాడు.

ఈ సంచలన హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు సుమారు 70 సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. బాధితురాలు చివరిసారిగా మాట్లాడిన కాల్ డేటా, పాఠశాల పునఃప్రారంభమయ్యాక గైర్హాజరైన 13 మంది విద్యార్థుల వివరాలను ఆరా తీశారు. అందులో పదో తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు కొన్ని రోజులుగా విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడి వద్ద లభించిన రూ.1.54 లక్షల నగదుపై రక్తపు మరకలు ఉండటంతో ల్యాబ్‌కు పంపగా, అది మనిషి రక్తంగా తేలింది. దీంతో నిందితులు నేరాన్ని అంగీకరించారు. గతంలో హాస్టల్‌లో ఉన్న సమయంలో నిందితుడి వద్ద డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి తల్లిదండ్రుల ముందే మందలించి డేస్కాలర్‌గా మార్చారని, దాంతో అతడు ఆమెపై కక్ష పెంచుకున్నాడని దర్యాప్తులో తేలింది. మద్యం, బైక్‌ల పిచ్చి, గోవా టూర్ల వంటి జల్సాలకు అలవాటు పడిన నిందితులు డబ్బు కోసం ఈ ఘాతుకానికి తెగబడ్డారని పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ మరియు ప్రిన్సిపల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారు మైనర్లు కావడంతో జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచనున్నట్లు ఎస్పీ తెలిపారు.

# మండలిలో డీఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

## తిరస్కరించిన ఛైర్మన్..కాసేపు మండలి వాయిదా

**అమరావతి :** ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండవాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవించటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఛైర్మన్ సభను ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు. ఛైర్మన్ టేబుల్‌ను కొడుతూ ఎందుకు నినాదాలు చేస్తున్నారని ప్రశ్నించారు. సభా మర్యాద కాపాడాల్సిన బాధ్యత సభ్యులపైనా ఉందని తెలిపారు. మనోహర్ వ్యాఖ్యలపై ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అసహనం వ్యక్తం చేశారు. సభా నిర్వహణ, నిబంధనల గురించి మీకు బాగా తెలుసు అని అన్నారు. వారిపై ఎలాంటి చర్యలు ఎలా తీసుకోవాలో మీకు తెలుసునని చెప్పారు.

సభ సంప్రదాయాల ప్రకారం జరగాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ హయాంలో కూడా మీరు ఛైర్మన్‌గా వ్యవహరించారని అన్నారు. రెడ్ లైన్ గీసి విపక్షాల వాళ్లు దాటి వస్తే సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు మీకు అధికారాలున్నాయని తెలిపారు. మూడు రోజులుగా సభకు అంతరాయం కలిగిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. ఛైర్మన్‌ను కించపరచాలనే ఆలోచన తమకు లేదని.. ఆయనకు పవర్స్ ఉన్నాయని చెప్పారు.

# మహాబలిపురంలో సీఎంల సమావేశం

**మొదటి పేజీ తరువాయి..** ఏపీ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూనే, రాష్ట్రంలోని ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చి అవసరమైన నిధులను సమకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేయనున్నారు.

# ఇరాన్ చేపట్టిన క్షిపణి దాడులపై తీవ్ర ఆగ్రహం

ఇరాన్ చేపట్టిన క్షిపణి దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (ఖూజు), ఆ దేశంతో ఉన్న అన్ని రకాల వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు ఇరాన్‌తో ఎలాంటి వ్యాపార మరియు ఆర్థిక వ్యవహారాలు కొనసాగించబోమని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమేలీ స్పష్టం చేశారు.

దేశ ప్రజలకు మరో క్షిపణి ముప్పు ఉందంటూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన కొద్ది గంటల్లోనే యూఏఈ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. క్షిపణి ముప్పు పొంచి ఉన్నందున ప్రజలంతా వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ అలర్ట్ జారీ చేసినప్పటికీ, ఆ తర్వాత కొద్దిసేపటికే దాన్ని ఉపసంహరించుకుంది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మొదలైనప్పటి నుంచి ఇరాన్ దాడుల తీవ్రతను యూఏఈ ఎక్కువగా ఎదుర్కొంటోంది. ఈ ప్రాంతంలోని ఏ ఇతర దేశం కంటే ఎక్కువగా, దాదాపు 3,000 క్షిపణులు మరియు డ్రోన్లను ఇరాన్ తమ భూభాగంపైకి ప్రయోగించిందని యూఏఈ ఆరోపించింది.

గల్ఫ్‌లో సాగుతున్న నౌకా రవాణాను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని యూఏఈ ఆరోపించగా, ఈ వ్యాఖ్యలను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఖండించారు. యూఏఈ చేస్తోందని చెబుతున్న ఆరోపణలు వాస్తవ దూరమని, ఇటువంటి ప్రకటనలు ప్రాంతీయ భద్రతకు మరియు పరస్పర విశ్వాసానికి తీవ్ర హాని కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# తొమ్మిదేండ్ల బాలికపై లైంగికదాడి

## పుణె జిల్లాలో ఘోర దుర్ఘటన

మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. అనారోగ్యంతో ఇంట్లోనే ఉన్న తొమ్మిదేళ్ల నాలుగో తరగతి బాలికపై పొరుగింట్లో నివసించే 25 ఏళ్ల యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడి, ఆపై గొంతు నులిమి అత్యంత దారుణంగా హత్య చేశాడు. బాధితురాలి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తుండగా, మంగళవారం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసి నిందితుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని వాగు వద్ద ఉన్న చెట్టు కింద పడేసి, ఏమీ తెలియనట్లు కుటుంబ సభ్యులతో కలిసి బాలిక కోసం వెతుకుతున్నట్లు నటించాడు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో బాధితురాలి కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు స్థానిక సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా, అనుమానాస్పదంగా సైకిల్‌పై వెళ్తున్న పొరుగింటి యువకుడు కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు.

నిందితుడు ఇచ్చిన సమాచారంతో బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టానికి తరలించి, ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించారు. ఈ దారుణ ఘటనతో స్థానికంగా తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమయ్యాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, కేసును వేగంగా విచారించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పుణె–నాసిక్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టి దిగ్బంధించారు.

# ఎపిలో పురపాలక ఎన్నికలకు రంగం సిద్ధం

## 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహణ

**అమరావతి :** ఏపీలో పురపాలక ఎన్నికల నిర్వహణలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేస్తూ ముందుకెళ్లనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ కమిషనర్, సంచాలకులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీ కాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల కూడా ఇప్పుడే ఎన్నికలు జరపనున్నారు. న్యాయపరమైన వివాదాలు, ఇతర సమస్యల కారణంగా మిగిలిన 23 పురపాలక సంఘాల్లో ప్రస్తుతానికి ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం తెలిపింది. 16వ ఆర్థిక సంఘం తాజా మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థలకు నిధులు మంజూరు కావాలంటే ప్రజలతో ఎన్నికైన పాలకవర్గం తప్పనిసరి. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోతే పట్టణ స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదముంది. రాజ్యాంగబద్ధమైన పాలనతో పాటు, ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘంతో పూర్తిస్థాయిలో సమన్వయం చేసుకోవాలని పురపాలక శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# అగ్నిప్రమాదంలో 9 మంది మృతి

**మొదటి పేజీ తరువాయి..** మరియు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే దట్టమైన పొగ పై అంతస్తులకు వ్యాపించడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషాద ఘటనలో ఒక చిన్నారితో సహా మొత్తం తొమ్మిది మంది ఊపిరిరాడక, గాయపడి ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరికొందరిని తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతులంతా వైద్య చికిత్స నిమిత్తం కోల్‌కతాకు వచ్చిన బంగ్లాదేశ్ జాతీయులుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. మూడో అంతస్తులోని ఎయిర్ కండిషనర్ (ాజ) పేలిపోవడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అనుమానిస్తున్నప్పటికీ, ఘటనపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోంది. హోటల్ నుంచి వ్యాపించిన అగ్నికీలలు పక్కనే ఉన్న భవనాల వైపు ప్రసరించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపగా, రెండు రోజుల క్రితమే బిర్భూమ్ జిల్లాలోని ఒక హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందిన ఉదంతం మరవకముందే మళ్లీ రాజధానిలో అలాంటి దుర్ఘటనే పునరావృతం కావడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

## డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

**హైదరాబాద్**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబరాబాద్ ఎస్వోటీ (ాూ), స్థానిక పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఒక భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టయినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు ప్రధాన మాదక ద్రవ్యాల సరఫరాదారులతో పాటు, వారి వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 16 మంది వినియోగదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి సుమారు రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ (వీణహీూ), 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయి మరియు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను పోలీసులు మొదట అరెస్ట్ చేశారు. అతడిని లోతుగా విచారించగా ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలు బెంగళూరు, కేరళ రాష్ట్రాల్లో ఉన్నట్లు స్పష్టమైంది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు ఈ నెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశాయి. ఒక నైజీరియన్ నుంచి ఈ డ్రగ్స్ తెచ్చినట్లు అతడు విచారణలో అంగీకరించాడు. అదేవిధంగా బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను అరెస్ట్ చేసి, ఆమె ఇంట్లో జరిపిన సోదాల్లో భారీగా మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. కేరళలోని తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు ఆమె తెలిపింది.

పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ (చీణూూ) యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఉన్న అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌పై దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. నగరంలో మాదకద్రవ్యాల సరఫరా లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే డయల్ 100 లేదా సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నంబర్ 8712663061కు సమాచారం అందించాలని డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బిసిల పట్ల కట్టప్పలా మారిన జగన్

### బిసి రిజర్వేషన్లపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

**అమరావతి** : రాష్ట్రంలో బీసీల పాలిట జగన్మోహన్ రెడ్డి కట్టప్పలా వ్యవహరించి వెన్నుపోటు పొడిచి అన్యాయం చేశారని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన బీసీ రిజర్వేషన్లపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలకు అవకాశం దక్కుతుందన్నారు. బీసీ వర్గీకరణ చేపట్టి రాజకీయ పదవులు అందరికీ అందేలా చూడాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకునేందుకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని జీవోలు జారీచేసి.. చివరికి 24 శాతానికి కుదించి తీవ్రంగా అన్యాయం చేశారన్నారు. నీతి ఆయోగ్ సూచనలు మేరకు ప్రత్యక్ష విధానంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాం నుంచి బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదోని పట్టణంలో రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలని ఆదోని భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. 1987 తర్వాత ఇప్పుడు 2025లో వంద అడుగుల వెడల్పుతో మాస్టర్ ఎ÷–లాన్ వచ్చిందన్నారు. దీనిని అమలు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించడం వల్ల పారదర్శకతతో పాటు అక్రమాలకు తావుండదన్నారు. గత వైకాపా పాలనలో ఆదోని పురపాలక సంఘంలో ఇద్దరు ఛైర్‌పర్సన్‌లను మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కిందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా...?

- పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి పోటీపై సుస్మిత పటేల్ సంచలన వ్యాఖ్యలు....
- పరకాల టికెట్‌పై సుస్మిత పటేల్ సంచలన వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌లో కలకలం....





హైదరాబాద్/, ఆగస్టు 19/ (జన సంఘర్షణ): పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం అయిన వెంటనే రేవంత్‌రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి పోటీ చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి ఎలా ప్రకటిస్తారని ఆమె ప్రశ్నించారు. ...లిపార్టీ టికెట్ విషయంలో స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఇచ్చే అంశంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా" ...అంటూ సుస్మిత పటేల్ స్పష్టం చేశారు. అంతేకాకుండా సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. సీఎంకు ఒకవైపు పొంగు ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదంటూ వ్యాఖ్యానించారు. పరకాల రాజకీయాల్లో తనకు అన్యాయం జరిగితే వెనక్కి తగ్గేది... లేదని స్పష్టం చేసిన సుస్మిత పటేల్. రేవంత్‌రెడ్డి నిర్ణయాలపై నేరుగా ప్రశ్నలు సంధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పరకాల టికెట్ విషయంలో తన వైఖరిని మార్చుకోకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానన్న సంకేతాలతో సీఎం రేవంత్‌రెడ్డికి సుస్మిత పటేల్ ఘాటు హెచ్చరిక జారీ చేశారు.

# రూపారెడ్డి హత్య కేసులో మిస్టరీ వీడింది

- ప్రైవేట్ స్కూల్ టెన్త్ విద్యార్థులే నిందితులు.. కత్తితో దాడి చేసి హత్య



నల్గొండ, /ఆగస్టు 19/ : జన సంఘర్షణ) కొండమల్లేపల్లి ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం..... ఈ హత్యకు అదే పాఠశాలలో చదువుతున్న టెన్త్ తరగతి విద్యార్థులే పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. గతంలో పాఠశాలకు సెల్‌ఫోన్ తీసుకువచ్చినందుకు రూపారెడ్డి విద్యార్థులను మందలించినట్లు సమాచారం..... ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న విద్యార్థులు ఆమెపై కక్ష పెంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు 11న మరో వ్యక్తి సహకారంతో రూపారెడ్డిపై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. అనంతరం ఆమె ఇంట్లో ఉన్న సుమారు రూ.4 లక్షల నగదును తీసుకుని నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం వారిని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

**విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి...**

చిన్న వయస్సులోనే విద్యార్థులు నేరాల వైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ, వారికి క్రమం తప్పకుండా నైతిక విలువలు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా పథకాలను రద్దు చేయవద్దు

- చర్ల బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా
- బి ఆర్ ఎస్ నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్
- బి ఆర్ ఎస్ చర్ల మండలం కన్వీనర్ దొడ్డి తాతారావు





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 19(జనసంఘర్షణ): కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్, రైతుభీమా పథకాలను తీసేయాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు, పిలుపు మేరకు భద్రాచలం నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్, చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో, చర్ల ఏంఆర్ఓ కార్యాలయం వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వహించి అనంతరం చర్ల తాసిల్దార్ శ్రీనివాసరావు కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రావులపల్లి రాంప్రసాద్, దొడ్డి తాతారావు, మాట్లాడుతూ.. పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా ఈ పథకాలను నిరంతరం కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందించాలని పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలి ఆడబిడ్డలకు అండగా బి ఆర్ ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్ ,మాజీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, పార్టీ సీనియర్ నాయకులు తోటపల్లి మాధవరావు, పెద్ద బుజ్జి గొర్ల రాజబాబు జోగిరాజు, కుదునూరు రాము, దినసరపు భాస్కర్ రెడ్డి,పంజా రాజు,కాకి అనిల్,గోరింట్ల వెంకటేశ్వరరావు, కొంబత్తిని రాము, బొజ్జ సాయి, ప్రణయ్ (బాచి), అంబోజి సతీష్,కుప్పాల నిరంజన్ కుప్పాల సౌజన్య, బేతంచర్ల నర్సవేణి, ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, పెద్ద మిసీలేరు సర్పంచ్ బెండ బోయిన సుహాసిని, కుదునూరు సర్పంచ్ కుంజా కమల, కట్టం కన్నారావు కారం కన్నారావు, సాదిక్, తెల్లశీ లక్ష్మీనారాయణ, సింగ సంతోష్, పాసిగంటి సంతోష్, సంతపూరి సతీష్, సృజన్, కుక్కడపు సాయి, మామిడి రాజు, తడికల చంద్రశేఖర్, కొంగూరి సోమరాజు, బట్ట కొమరయ్య, గుమ్మల నరేంద్ర, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా బి. రాజాగౌడ్....

- గతంలో బాన్సువాడ ఆర్డీవోగా సేవలు.. త్వరలో బాధ్యతల స్వీకరణ...



నిజామాబాద్, ఆగస్టు 19 (జన సంఘర్షణ నిజామాబాద్ బ్యూరో): నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బి. రాజాగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా ఏసీడీసీ హోదాలో విధులు నిర్వహిస్తున్న రాజాగౌడ్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు వెలువరించారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా.... ఐఏఎస్, నాన్-క్యాడర్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**బాన్సువాడలో ప్రత్యేక గుర్తింపు.....**

బి. రాజాగౌడ్ గతంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఆర్డీవోగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించడంతో ప్రజల మన్ననలు పొందారు. అధికారిగా తనదైన శైలిలో పనిచేసిన ఆయనకు నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించడంతో జిల్లా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. రాజాగౌడ్ త్వరలో నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# కోటగిరిలో విద్యార్థుల ఆందోళన...

- జీవో 97ను వెంటనే రద్దు చేయాలి : పీడీఎస్ఎఫ్ - డీఎఎస్ఎఫ్ఐ




కోటగిరి,/ ఆగస్టు 19 /(జన సంఘర్షణ): పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులను ఐటీఐ విద్యార్థులతో సమానంగా పరిగణించే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని పీడీఎస్ఎఫ్ -డీఎఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశాయి. ఈ మేరకు కోటగిరి మండల కేంద్రంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. బాల్రాజ్, డీఎఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్ మాట్లాడుతూ..మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సును స్కిల్ పాలసీలోకి తీసుకురావడం సరికాదని అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యా అర్హతలు, సాంకేతిక నైపుణ్యాలను ఐటీఐ కోర్సులతో సమానంగా పరిగణించడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే జీవో 97ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల ర్యాలీ, రాస్తారోకోతో కోటగిరి ప్రధాన రహదారిపై కొద్దిసేపు.. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి జీవోను రద్దు చేయాలని విద్యార్థులు నినాదాలు చేశారు.

# మెదక్ జిల్లాలో కోతుల బెడద నియంత్రణపై పటిష్ట చర్యలు

- స్థానిక శాసనసభ్యుల, ప్రజా ప్రతినిధుల సహకారంతో
- ప్రత్యేక కార్యాచరణ ద్వారా వడి వడిగా ముందుకు పోవాలి.
- రైతులకు కోతుల బెడదను తప్పించాలన్న విషయంలో కృతనిశ్చయంతో పనిచేయాలి.
- కోతులను పట్టి వాటిని నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ద్వారా సంతతి పెరగకుండా చూడటం.





ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(జన సంఘర్షణ) మెదక్, నర్సాపూర్,తూప్రాన్ మున్సిపల్ కమిషనర్స్, అటవీ, జిల్లా పంచాయతీ శాఖ సమన్వయ సమావేశంలో కలెక్టర్ వెల్లడి.మెదక్ జిల్లాలో కోతుల బెడద నివారించడానికి స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో వేగవంతమైన కార్యాచరణతో ముందుకు కదరాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాంబర్లో కోతుల బెడద నివారణపై డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య,మెదక్, నర్సాపూర్,తూప్రాన్ మున్సిపల్ కమిషనర్స్ తో కలెక్టర్ ప్రతిమాసింగ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చడంతో అనేక పర్యాయాలు రైతుల నుండి ప్రజల నుండి పంటలను ధ్వంసం చేస్తున్నాయని, ఇండ్లలో దూరి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని, చదువుకునే విద్యార్థిని విద్యార్థులు కూడా వీటి దాడిలో గాయపడ్డ సన్నివేశాలు ఉన్నాయనీ ప్రజావాణిలో అనేక విన్నపాలు రావడం జరిగిందని, అనేకమంది ప్రజలు , రైతులు కోతులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాటి నుండి పూర్తిగా విముక్తి చేయాలనే సదుద్దేశంతో క్షేత్రస్థాయిలో రైతుల పంటలను కాపాడాలని, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజల సహాయ సహకారాలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కోతులను పట్టడానికి వాటిని తరలించడానికి అవసరమయ్యే నిధులపై , ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహాయ సహకారాలు ఉంటాయన్నారు కోతులను పట్టిన వెంటనే స్థానిక అటవీ అధికారుల ఎఫ్ఆర్ఓ సహకారంతో నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ పద్ధతి ద్వారా వాటిని అక్కడే విడిచి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోతుల బెడద నియంత్రణ ఒక ఉద్యమంలో చేపట్టి ముందుకు వెళ్లినట్లయితే దశలవారీగా వాటి నిర్మూలించడానికి అందరి సహాయ సహకారాలు అందుతాయని తద్వారా కోతుల నియంత్రణ జిల్లాగా మెదక్ జిల్లా అని తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అటవీ అధికారి జోజి, డిపిఓ యాదయ్య మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు పరిశుభ్రత పాటించాలి

- ఇంటి పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.
- తొనిగండ్ల గ్రామంలో వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడిన గ్రామ సర్పంచ్ శివకుమారి నాగులు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ) గ్రామంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామ సర్పంచ్ శివకుమారి నాగులు ప్రజలకు సూచించారు. బుధవారం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అన్ని రకాల రోగులు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య బృందం గ్రామానికి వచ్చి తగిన మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలోని ప్రజలందరూ ఎవరి ఇంటి వద్ద వారు నిల్వ నీరు లేకుండా, చెత్తాచెదారం, పరిశుభ్రత పాటించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శి మౌనిక, అక్కన్నపేట పిహెచ్ సి డాక్టర్ కళ్యాణి, ఏ ఎన్ ఎం ఎలీషా, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ దుర్గయ్య, వార్డు సభ్యులు నాగులు,బాలకృష్ణ, భాను ప్రసాద్,లక్ష్మి మాజీ సర్పంచులు పిట్ల భూలింగం, పిట్ల శామయ్య, బోయిని శంకర్, కయ్య సిద్ధ రాములు, పిట్ల ప్రవీణ్ కుమార్ తోపాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళలు రాజకీయంగా ఎదగాలి



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ) మహిళాలు రాజకీయంగా ఎదుగాలని మెదక్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షు రాలు పట్లోల్ల మల్లికా అన్నారు. మహిళా మోర్చ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో మెదక్ జిల్లా మహిళా మోర్చా కార్యవర్గం ఎన్నుకున్నారు. మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇప్ప అఖిల భారత్, మేకల లావణ్య. జిల్లా ఉపాధ్యక్షులు పబ్బ రాజమణి, కమ్మరి మౌనిక, లింగాల మమత, సరిత, శైలజ, శ్రీనివాస్, కార్యదర్శులు రాజమణి, రాజేశ్వరీ, స్వప్న, నాగలక్ష్మి, కోశాధికారి నాయిని యశోద, ఐటీ సెల్ ఈర్ల రేఖ ఎన్నుకున్నారు. ఎన్నికఅయ్యన వారికి బాధ్యత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు మహిళా కమిటీ వెయ్యడం అయ్యిందని అన్నారు. ఎంపీ మహిళలలకు ప్రోత్సహం ఇస్తున్నారని అభినందయని చెప్పారు. ప్రతీ రంగంలో మహిళాలు ఆర్థిక అభివృద్ధి ఉండలని మల్లికా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి ,శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనార్ధన్,గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఖిచ్చి గ్యాన్ సింగ్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నగేష్ గౌడ్,కిసాన్ మోర్చా జిల్లా నాయకులు వెంకట్, సూర్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ

గురువారం
20 ఆగస్టు 2026

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

❑ **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(జన సంఘర్షణ)

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎన్నికల విభాగ సూపరింటెంట్ గఫార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్,మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లోని వ్యత్యాసాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అలాగే అక్టోబర్ 15 వరకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాల్లో చేపడుతున్న చర్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి,రాష్ట్ర స్థాయికి పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా,సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లకు సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు-అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ, సమయాలను ముందుగా ఖరారు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో ఎన్నికల విభాగ సూపరింటెంట్ గఫార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# మెదక్ జిల్లాలో కోతుల బెడద నియంత్రణకు పటిష్ట చర్యలు

- ❑ **ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ**
- ❑ **రైతుల పంటలకు రక్షణే లక్ష్యం.**
- ❑ **వేగంగా చర్యలు చేపట్టాలి**
- ❑ **కోతులను పట్టి నిర్మల్‌కు తరలింపు.**
- ❑ **కుటుంబ నియంత్రణ చర్యలు**
- ❑ **మున్సిపల్, అటవీ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
- ❑ **అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాలు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లాలో రైతులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల బెడదను నియంత్రించేందుకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక శాసనసభ్యుడు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కోతుల బెడద నివారణపై జిల్లా అటవీ అధికారి జోజి,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యతో పాటు మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

**రైతుల పంటలను కాపాడాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రరూపం దాల్చిందన్నారు. పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు సైతం కోతుల దాడుల్లో గాయపడిన సందర్భాలు ఉన్నాయని, కోతుల సమస్యపై ప్రజావాణిలో అనేక ఫిర్యాదులు, వినతులు అందుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సమస్యను సాధారణ అంశంగా కాకుండా ప్రజలు, రైతుల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పట్టుకుని నిర్మల్‌కు తరలింపు**

కోతులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను ముందుగా గుర్తించి, ప్రత్యేక బృందాల ద్వారా వాటిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పట్టుకున్న కోతులను స్థానిక అటవీ శాఖ అధికారులు, ఎఫ్ఆర్ఓల సహకారంతో నిర్మల్ జిల్లాకు తరలించి, అక్కడ కుటుంబ నియంత్రణ ప్రక్రియ చేపట్టి సంతతి పెరగకుండా చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. కోతులను పట్టుకోవడం, తరలించడం తదితర కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణలో ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహాయ సహకారాలను కూడా తీసుకోవచ్చని సూచించారు.

**ఉద్యమంలా చేపట్టాలి**

కోతుల బెడద నియంత్రణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడితే దశలవారీగా సమస్య తీవ్రతను తగ్గించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్, అటవీ, జిల్లా పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.రైతుల పంటలను కాపాడాలి. ప్రజలకు కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించాలి. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజల భాగస్వామ్యంతో పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలి” అని కలెక్టర్ సూచించారు. కోతుల నియంత్రణలో మెదక్ జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు కృతనిశ్చయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా అటవీ అధికారి జోజి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఏటీఎం చోరీ స్థలాన్ని పరిశీలించిన మెదక్ ఎస్పీ

❑ **నిందితుల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19(జన సంఘర్షణ)

మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంబోజిపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంలో జరిగిన చోరీ ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, పరిశీలించారు. ఘటనపై పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేయాలని సూచించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. త్వరితగతిన కేసును ఛేదించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.




# కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె 108వ ప్రపంచ ఫోటోగ్రఫీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)

కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే జన్మదిన సందర్భంగా 187 వరల్డ్ ఫోటోగ్రఫీ సందర్భంగా రామాయంపేట మండల యూనియన్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా సంబరాలు నిర్వహించడం జరిగింది. ఇందులో అధ్యక్షులు రొయ్యల హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి వినోద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. రామాయంపేట మండలంలో 100 పైగా ఈ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. మాకు స్థానిక ఎమ్మెల్యే,మున్సిపల్ ఛైర్మెన్ ఫోటోగ్రాఫర్ సంఘ భవనానికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి సహకరించగలరు.

# నర్సాపూర్ పట్టణ గర్భిణీ స్త్రీలకు మాతృదేవోభవ కానుక

❑ **నర్సాపూర్ పట్టణ ప్రాంతంలో 130 మంది గర్భిణీ స్త్రీలకు ఉచితంగా ప్రోటీన్ కిట్ల పంపిణీ.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ ప్రాంతంలోని గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మాతృదేవోభవ కార్యక్రమం ద్వారా 130 ప్రోటీన్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన పోషకాహారం అందించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యానికి తోడ్పడాలనే ఉద్దేశంతో మాతృదేవోభవ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆవుల రాజిరెడ్డి తెలిపారు.ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండటం, ప్రతి బిడ్డ ఆరోగ్యంగా జన్మించడం సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ కిట్లను అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ఆర్ భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి..

❑ **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రింగ్ రోడ్డుకు సంబంధించి ట్రిపుల్ ఆర్ భూ సేకరణ ప్రక్రియపై నేషనల్ హైవేస్, రైల్వే, రెవిన్యూ ఆర్డీవోలు, తాసిల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ నియోజకవర్గం వారీగా భూ సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు అవార్డు పాసైన భూముల వివరాలను భూమి రాసి పోర్టల్ లో నమోదు చేయాలని,రైతులకు పేమెంట్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయడం ద్వారా రింగ్ రోడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. రైల్వే డబ్లింగ్ వర్క్ మేడ్చల్ టు ముద్దేడ్ వివరాల గురించి. చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ రామకృష్ణ, తూప్రాన్ బావయ్య, నేషనల్ హైవేస్ మేనేజర్ రాహుల్, రైల్వే ఎస్సీ డి ధర్మారావు, రాకేష్ సంబంధిత తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# చేగుంటలో ఈ నెల 22వ తేదీ జిల్లాస్థాయి యోగాసన పోటీలు

❑ **జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరణం గణేష్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి బుజగేందర్ రెడ్డి లు తెలిపారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)

ఈనెల 22వ తేదీ నాడు చేగుంటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయి యోగాసనా పోటీలు ఉంటాయని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కరణం గణేష్ రవికుమార్ ప్రధాన కార్యదర్శి మేడభుజగేందర్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 10 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల వరకు సబ్ జూనియర్, 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు జూనియర్, 18 నుండి 28 సంవత్సరాల వరకు సీనియర్ బాలబాలికలకు మరియు 28 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల వరకు, 35 నుండి 45సంవత్సరాల వరకు, 45 నుండి 55 సంవత్సరాల వరకు మహిళలకు పురుషులకు పోటీలు ఉంటాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని అండర్ 14 బాలబాలికలు 1-1 2012 నుండి 31- 12- 2017 మధ్యలో జన్మించిన వారై ఉండాలనీ ,అండర్ 18 జూనియర్ విభాగం బాలబాలికలు 1-1- 2008 నుండి 31- 12-2011 మధ్య జన్మించిన వారై ఉండాలనీ. సీనియర్ 18 నుండి 28 ఏజ్ గ్రూప్ విభాగంలో 1-1-1998 నుండి 21-12-2007 మధ్యలో జన్మించిన వారై ఉండాలని, సీనియర్ ఏ విభాగానికి చెందిన మహిళలు పురుషులు 01-01-1991 నుండి 31-12- 1997 మధ్యలో జన్మించిన వారై ఉండాలనీ, సీనియర్ బి 35నుండి 45 సంవత్సరాల విభాగానికి చెందినవారు 01-01-1981 నుండి 31-12-1990 మధ్యలో జన్మించిన వారై ఉండాలనీ ,సీనియర్ సి 45 టు 55 విభాగానికి చెందినవారు 01o01-1971 నుండి 31-12-1980 మధ్యన జన్మించిన వారై ఉండాలనీ ఈ పోటీల్లో పాల్గొని క్రీడాకారులు క్రీడాకారిణిలు ఉదయం 8 గంటల వరకు చేగుంటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలనీ వారు తమ వెంట బోనఫైడ్, ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికెట్ తోపాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావలనని పోటీల్లో పాల్గొనే వారికి ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజన సౌకర్యం కలదని వారు తెలిపారు.

## రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి పర్యటించారు



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి పర్యటించారు. కాట్రియాల గ్రామానికి చెందిన మైలారం వెంకటయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మైలారం వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైలారం శ్యామ్, ఉప సర్పంచ్ బాబు నాయక్, సాయి రెడ్డి, శ్రీశైలం రెడ్డి, శ్రీకాంత్ సాగర్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగస్టు 19(జనసంఘర్షణ):**



చర్ల, ఆదివాసీ హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, ఆదివాసీ సమాజ సమస్యల పరిష్కారం కోసం, భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చెయ్యాలని ప్రధాన డిమాండ్‌తో సొందే వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించే మహా పాదయాత్రకు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నది అని తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు, 1/70 చట్టం, ఐదో షెడ్యూల్, పేసా, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, ఆదివాసీ యువత, నిరుద్యోగ ఆదివాసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగష్టు 20వ తేదీన భద్రాచలం ఐటిడిఏ కార్యాలయం వద్ద మహా పాదయాత్ర ముగింపు కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివాసీ సమాజం మొత్తం ఐక్యంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఆదివాసీ యువత, నిరుద్యోగ ఆదివాసీ విద్యార్థులు, మహిళలు, ఆదివాసీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని మన హక్కుల కోసం గళమెత్తాలని కోరారు. "ఆదివాసుల ఐక్యతే మన బలం – రాజ్యాంగ హక్కుల పరిరక్షణే మన లక్ష్యం" అనే నినాదంతో మహా పాదయాత్ర ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని, ఇరప రాజు దొర పిలుపునిచ్చారు.

## ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లుకు అన్నివిధాలుగా ఆదుకోవాలి

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)**



ఫోటో, వీడియోగ్రాఫర్లకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రోత్సహం ఇవ్వాలని మెదక్ జిల్లా ఫోటోఢ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు కంచి ఆనంద్ అన్నారు. బుధవారం రోజున మెదక్ పట్టణ ములోని సాయి బాలాజీ గార్డెన్ లో తెలంగాణ ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయి బాలాజీ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు కంచి ఆనంద్ సమక్షంలో రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల జెండా ఆవిష్కరణ చేశారు. మెదక్ జిల్లాలోని ఫోటో వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సాయి బాలాజీ గార్డెన్ నుండి రాం దాస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కెమెరా సృష్టికర్త డాగూరె చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. 187 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 19వ తేదీ ప్రపంచవ్యాప్తంగా ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. జిల్లాలోని ఫోటో గ్రాఫర్ల సమక్షంలో కనిష్ట ధరల పట్టికను రిలీజ్ చేశారు. జిల్లాలోని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సీనియర్ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు కంచి ఆనంద్ ఆధ్వర్యంలో శాలువాలతో మేమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి జి ఆర్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు నరేష్,సాయి దత్త హాస్పిటల్ డాక్టర్ పెంట గౌడ్,ఎచ్ డి ఎఫ్ సి రీజినల్ మేనేజర్ రాఘవేంద్రరావు,అర్జున్, హాస్పిటల్ డాక్టర్ తిరుమలేష్ డాక్టర్ స్వాతి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి దాసరి శ్రీధర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్పల్లి సురేష్, జిల్లా గౌరవ సలహాదారులు బచ్చు బసవరాజ్, ఆడెపు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ చంద్రశేఖర్, కోశాధికారి కూచన శ్రీధర్ ,మెదక్ మండల అధ్యక్షులు సురేందర్ కోశాధికారి శ్రీకాంత్ జిల్లాలోని మండలాలకు సంబంధించిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోశాధికారులు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ లు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీ బంద్ విజయవంతం

- తుడుందెబ్బ పొలిట్ బ్యూరో వాసం ముసలయ్య అదేశాల మేరకు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగస్టు 19(జనసంఘర్షణ):**






చర్ల లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో బంద్ కు తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా చర్ల లోని విద్య సంస్థలు, వ్యాపార సముదయాలు, వాణిజ్య సంస్థలు, చర్ల తుడుందెబ్బ ఆధ్వర్యంలో ముసివేయడం జరిగింది. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో ఉన్న 5 వ షెడ్యూల్, ఏజెన్సీ హక్కులు 1/59,1/70 పార్లమెంట్ చట్టం, 1996 పేసా చట్టం పటిష్టంగా అమలుచేయాలి. అదేవిధంగా జీవో నెంబర్ 3 స్థానంలో, ఏజెన్సీ లో 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో ను ప్రభుత్వం ప్రకటించాలి, అదేవిధంగా పోలీస్ నియామకలలో జీవో నెంబర్ 109 ప్రకారం 75 శాతం ఉద్యోగాలు ఆదివాసులకు కేటాయించలని ఈ సందర్భంగా తెలియచేసారు. అదేవిధంగా 1/70 చట్టం పై గిరిజనేతరుల చేసే కుట్రలను తుడుందెబ్బ ఉద్యమం ద్వారానే ఎదుర్కొంటుందని తెలియచేసారు. ఈ కార్యక్రమం లో తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, తుడుందెబ్బ మండల నాయకులు పురిటి ప్రశాంత్, కోరం మృగరాజు, సప్క మధు, తదితరులు పాల్గొన్నారు.

## విరహత్ అలీ కి మాతృ వియోగం

- పలువురు ప్రముఖుల పరామర్శ.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జన సంఘర్షణ)**



తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ( టి యూ డబ్ల్యూ జె) అధ్యక్షుడు కె. విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. అంత్య క్రియలు గజ్వేల్‌లో బుధవారం సాయంత్రం జరిగాయి. విషయం తెలుసుకున్న పలువురు గజ్వేల్‌లోని విరహత్ అలీ ఇంటికి చేరుకొని బాషారత్ ఉన్నిసా బేగం మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వీరహత్ అలీతో పాటు కుటుంబ సభ్యులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ఐజేయు జాతీయ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్,మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు నందిని సిధారెడ్డి,దేవి ప్రసాద్,వంటేరు ప్రతాప్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్,సీనియర్ జర్నలిస్టులు ఫైసల్ అహ్మద్, రంగాచారి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంగి శెట్టి చందన, మాజీ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, పలువురు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పరామర్శించారు. అనంతరం సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో పలువురు పాల్గొన్నారు.

## కంచర్ల చంద్రశేఖర రావు 75వ జన్మదిన వేడుక

- పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం, ఆగస్టు 19(జనసంఘర్షణ):**





కొత్తగూడెంలో నిర్వహించిన కంచర్ల చంద్రశేఖర రావు 75వ జన్మదిన వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కంచర్ల చంద్రశేఖర్ రావు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు, సమాజానికి మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఇతర ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో కాంగ్రెస్ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం విజయవంతం..

- పార్టీ బలోపేతంపై కీలక దిశానిర్దేశం..
- బాన్సువాడ నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు..


**నిజామాబాద్ బ్యూరో/, ఆగస్టు 19:/జన సంఘర్షణ)**




నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బలోని ఫంక్షన్ హాల్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం విజయవంతంగా నిర్వహించారు. సమావేశానికి మంత్రి ధనసరి అనసూయ సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాటం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ సమావేశంలో.... పాల్గొని జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ అర్బన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌తో పాటు పొలిటికల్ యాక్షన్ కమిటీ సభ్యులు, డీసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాన్సువాడ నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు...**

బాన్సువాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఆయన అనుచరులు, కాంగ్రెస్ అభిమానులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తరలివచ్చారు. దీంతో సమావేశ ప్రాంగణంలో బాన్సువాడ కాంగ్రెస్ శ్రేణుల సందడి కనిపించింది. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడాలని నాయకత్వం స్పష్టం చేసింది. ఈ సమావేశం ద్వారా కార్యకర్తలకు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో



మమేకం లక్ష్యంగా సమావేశం విజయవంతంగా ముగిసింది.

# పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలి..

- ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం ధర్నా..
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు

నిజామాబాద్ బ్యూరో, /ఆగస్టు 19:/జన సంఘర్షణ)

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించాలంటూ ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం నిజామాబాద్‌లో ఆందోళనకు దిగింది. నిజామాబాద్‌లో కాంగ్రెస్ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరుగుతున్న సమయంలో రహదారిపై బైఠాయించిన ఆ వర్గం నాయకులు పోచారం శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. సమావేశానికి మంత్రి ధనసరి అనసూయ సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్... హాజరైన నేపథ్యంలో ఏనుగు వర్గం చేపట్టిన ధర్నా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులపై విమర్శలు చేయడం సరికాదని ఆందోళనకారులు ఆరోపించారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయనపై అధిష్టానం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పాత కాంగ్రెస్ నేతలను విస్మరిస్తున్నారంటూ ఆరోపణ..**

దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోస్తూ పార్టీ కోసం పనిచేసిన పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం ఆరోపించింది. నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నాయకులు ఎదగకుండా అడ్డుకుంటూ, తన అనుచరులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించింది. అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీపై తిరుగుబాటు ధోరణితో వ్యవహరిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. ఇటీవల బీర్కూరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులపై పోచారం చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారితీశాయని వారు పేర్కొన్నారు.

**సహకార పదవులపై కూడా డిమాండ్...**

నియోజకవర్గంలోని సహకార సంఘాల అధ్యక్ష పదవుల్లో ఏనుగు రవీందర్ రెడ్డి వర్గానికి చెందిన నాయకులకు అవకాశం కల్పించాలని కొందరు నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న పాత కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు, అవకాశాలు కల్పించాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.

**అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ....**

.బాన్సువాడ నియోజకవర్గం నుంచి ఏనుగు రవీందర్



రెడ్డి వర్గం భారీ కాన్వాయ్‌తో నిజామాబాద్‌కు చేరుకుని తమ నిరసనను వ్యక్తం చేసింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగితే నియోజకవర్గంలో పార్టీకి నష్టం జరుగుతుందని, పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలని పీసీసీ చీఫ్‌ను కోరారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. దీంతో పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం సందర్భంగా బాన్సువాడ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

# పోక్సో కేసులో నాంపల్లి కోర్టు సంచలన తీర్పు

- 33 మంది నిందితులకు శిక్ష.. ఐదుగురికి జీవిత ఖైదు
- తొమ్మిది మంది బాలికలకు రూ.45 లక్షల పరిహారం...

హైదరాబాద్, ఆగస్టు 19 (జన సంఘర్షణ):

బాలికలను అక్రమంగా తరలించి వ్యభిచారంలోకి నెట్టడం, లైంగిక దోపిడీకి పాల్పడిన కేసులో నాంపల్లి పోక్సో ప్రత్యేక సెషన్స్ కోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. 33 మంది నిందితులను దోషులుగా నిర్ధారించిన కోర్టు.. ఐదుగురికి జీవిత ఖైదు, మిగిలిన వారికి వివిధ కాలపరిమితులతో కఠిన కారాగార శిక్షలు విధించింది. అలాగే బాధితులైన తొమ్మిది మంది బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

**ఉద్యోగం పేరుతో మోసం..**


సీఐడీ హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లో 2015లో నమోదైన క్రైం నంబర్ 14/2015 ఈ కేసుకు సంబంధించినది. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఓ యువతికి పరిచయస్తుడు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి, అనంతరం కొందరు నిందితులకు పరిచయం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెను వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టడంతో పాటు లైంగిక దోపిడీకి గురిచేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. సుమారు నాలుగు నెలల పాటు నిందితుల చెరలో ఉన్న బాధితురాలు వారి నుంచి తప్పించుకుని సీఐడీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**దాడుల్లో 9 మంది బాలికలకు విముక్తి..**

కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు పలు వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ1 నుంచి ఏ45 వరకు పలువురు నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు తొమ్మిది మంది మైనర్ బాలికలు, ఇతర బాధితులను రక్షించారు. నేరానికి సంబంధించిన కీలక ఆధారాలను సేకరించిన అధికారులు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

**శిక్షలు ఇలా..**

ప్రత్యేక సెషన్స్ జడ్జి శ్రీ ఉదయ్ భాస్కర్‌రావు విచారణ




అనంతరం 33 మంది నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఐదుగురికి జీవిత ఖైదు. ముగ్గురికి 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష. 14 మందికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష. 11 మందికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష. పోక్సో చట్టం, ఐపీసీ, ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) యాక్ట్ తదితర చట్టాల కింద ఈ శిక్షలు విధించినట్లు అధికారులు తెలిపారు.

**బాలికలకు రూ.45 లక్షల పరిహారం...**

నిందితుల చర్యల వల్ల శారీరకంగా, మానసికంగా తీవ్ర వేదనకు గురైన తొమ్మిది మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటికే చట్టపరంగా అందిన పరిహారానికి అదనంగా ఈ మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేసింది. పరిహారం చెల్లింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శిని ఆదేశించింది. నిందితులపై విధించిన జరిమానా మొత్తాన్ని కూడా బాధితులకు పరిహారంగా అందించాలని కోర్టు సూచించింది.

**అధికారుల సమర్థ దర్యాప్తు...**

కేసు దర్యాప్తు అధికారులుగా డీఎస్పీలు సురేశాబాబు, కె. శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ కె. బాలరాం రెడ్డి వ్యవహరించారు. కోర్టు డ్యూటీ అధికారిగా హెడ్ కానిస్టేబుల్ శాంతి శ్రీనివాస్ రెడ్డి (హెచ్‌సీ-2044), కేసు మానిటరింగ్ అధికారిగా సీఐడీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణరెడ్డి విధులు నిర్వహించారు. ప్రభుత్వ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరెల్ల రమాదేవి కేసును వాదించారు.

**నేరస్థులకు కఠిన హెచ్చరిక..**

మహిళలు, బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడే వారికి చట్టం నుంచి తప్పించుకునే అవకాశం లేదని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. శాస్త్రీయ దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో నిందితులకు శిక్షలు పడేలా చేసిన ఈ తీర్పు కీలకమని సీఐడీ మహిళా భద్రత విభాగం పేర్కొంది. బాధిత బాలికలకు రక్షణ, పునరావాసం, పరిహారం కల్పించడంతో పాటు నేరస్థులను చట్టం ముందు నిలబెట్టడమే లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లకు రూ.230కే సిమెంట్ బస్తా

- పేదల సొంతింటి కలకు మరింత భరోసా..
- మార్కెట్ ధర రూ.330.. లబ్ధిదారులకు రూ.230కే సిమెంట్

కామారెడ్డి/, ఆగస్టు 19 (జన సంఘర్షణ):

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మరింత ప్రోత్సాహం అందిస్తోంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను మార్కెట్ ధర కంటే తక్కువకే లబ్ధిదారులకు అందించే చర్యలు చేపట్టింది. ప్రస్తుతం మార్కెట్‌లో సుమారు రూ.330గా ఉన్న సిమెంట్ బస్తాను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేవలం రూ.230కే అందించనున్నట్లు ప్రకటించింది.

**ప్రతి సోమవారం నిర్మాణ పురోగతికి అనుగుణంగా నిధులు..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోకుండా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంది.

**సొంతింటి కలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం..**

పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం



చేయడంలో ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. సిమెంట్‌ను తక్కువ ధరకే అందించడం వల్ల ఇళ్ల నిర్మాణం చేపడుతున్న పేద కుటుంబాలకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ పనిచేస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి.. రాబోయే కాలంలో ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకవర్గ




అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం లబ్ధిదారులకు మరింత ఊరటనిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు అన్న కుమారుని వివాహ వేడుక

- కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగస్టు 19(జనసంఘర్షణ):



ఆర్ కొత్తగూడెం గ్రామంలోని ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు అన్న కుమారుని వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన జంటకు సుఖ సంతోషాలతో వారి జీవితం సాగాలని అందరూ మనసారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు నూగురు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు,బండారు రామకృష్ణ, ఆవుల విజయభాస్కర్ రెడ్డి,కుమార్ రాజా,మడకం పద్మజ,పూనమ్ లక్ష్మి సర్పంచ్, నాయకులు పటేల్ వెంకటేశ్వర్లు, సుందరి సురేష్, ఆవుల శ్రీను,పెద్దిరెడ్డి, కనితి శ్రీనివాసరావు, వర్ష చింతయ్య, పూనెం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్‌లో రెండు ఇళ్ల చోరీ కేసు ఛేదన

- నిందితుడి అరెస్ట్, ఇనుప రాడ్ స్వాధీనం
- సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు..

బాన్సువాడ/, ఆగస్టు 19: /జన సంఘర్షణ




బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు సంవత్సరం క్రితం జరిగిన రెండు ఇళ్ల చోరీ కేసును పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 01.08.2025న సాయంత్రం 7 గంటల సమయంలో బీర్కూర్లోని ఒక ఇంటి తాళం పగలగొట్టి, బీరువా తాళాలను కూడా ధ్వంసం చేసి బంగారం, వెండి ఆభరణాలను చోరీ చేశారు. అదే రాత్రి ఎదురుగా ఉన్న మరో ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని రూ.2,000 నగదును దొంగిలించారు. రెండు ఇళ్లలో చోరీకి గురైన వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.22,000గా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాన్సువాడ డీఎస్పీ, బాన్సువాడ రూరల్ సీఐ పర్యవేక్షణలో బీర్కూర్ ఎస్సై ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఫింగరింట్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన సకత్ గోపి అనుమానితుడిగా గుర్తించారు. 19.08.2026న మహారాష్ట్ర నుంచి బోధన్ వైపు వెళు న్న సమయంలో బరంగేడిగి గ్రామం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సుమారు సంవత్సరం క్రితం బీర్కూర్ పరిధిలో దొంగతనానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి ఒక ఇనుప రాడ్ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. నిందితుడి గత నేర చరిత్రను పరిశీలించగా 2022 సంవత్సరంలో బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో కూడా రిమాండ్కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మిగిలిన దర్యాప్తు కొనసాగుతోంది. నేరాల నియంత్రణలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం, ఫింగర్రెంట్, సీసీ కెమెరాల వినియోగంతో నేరాలను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కోటగిరిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం..

- ఐలమ్మ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ.. పాల్గొన్న ఫోటోగ్రాఫర్ల సంఘం సభ్యులు

కోటగిరి,/ ఆగస్టు 19/ జన సంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా ఉమ్మడి కోటగిరి మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెంటయ్య చారి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగం ప్రాధాన్యత, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్రపై సభ్యులు మాట్లాడారు. ఒక చిత్రంలో ఒక సంఘటనను, ఒక కాలాన్ని, ఒక చరిత్రను భద్రపరిచే శక్తి ఫోటోగ్రఫీకి ఉందని పేర్కొన్నారు. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా ఫోటోగ్రఫీకి ఉన్న ప్రత్యేకత ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రాజేశ్వర్‌తో పాటు సభ్యులు సురేష్, దినేష్, నవీన్, భాస్కర్, శ్రీను, రమేష్, అనంత చారి, రాజు, బట్టు, పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఫోటోగ్రఫీ రంగంలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో తమ వంతు పాత్ర పోషించాలని సభ్యులు ఆకాంక్షించారు. అనంతరం అందరూ కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకున్నారు.


# మన ఆలోచన సాధన సమితి (మాస్) ఆధ్వర్యంలో నేడు

# బడుగుల బంధువు "టైగర్" ఆలె నరేంద్ర జయంతి

- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు గంటలకు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ నేతలు అందరూ హాజరు.
- "టైగర్" నరేంద్ర - ఒక ముగింపు కాదు, ఒక స్ఫూర్తి.
- పోరాటం చేసిన ప్రతి అడుగు వెంటనే ఫలితం ఇవ్వకపోవచ్చు.
- కానీ నిజాయితీగా వేసిన అడుగు చరిత్రలో ఎప్పటికీ వృథా కాదు."
- ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు తెలియాలి
- ఆధిపత్య రాజకీయాల మాటున దాచి ఉంచిన ఒక పోరాట చరిత్ర
- ఆ చరిత్రలో ఆలె నరేంద్ర అధ్యాయం కూడా ఒక ప్రధాన భూమిక.
- ఆధిపత్య కథనాల మాటున కనుమరుగైన చరిత్ర
- చరిత్రలో ఒక ఉద్యమం విజయవంతమైన తరువాత,
- ఆ విజయానికి ప్రధాన కథనం కొద్దిమంది నాయకుల చుట్టూ కేంద్రీకృతమవుతుంది.

హైదరాబాద్ సిటీ ప్రతినిధి నాగుల అంజిబాబు, ఆగస్టు 19, (జన సంఘర్షణ):

హైదరాబాద్ నడిబొడ్డున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు రాజకీయ పార్టీలకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బీసీ సంఘాల నాయకులు హాజరవుతున్నారు. ఉద్యమం ప్రారంభ దశల్లో కీలక పాత్ర పోషించిన అనేక మంది నాయకుల పాత్రలు వెనుకబడిపోతాయి. ఆ కోణంలో చూస్తే ఆలె నరేంద్ర రాజకీయ జీవితం ఆధిపత్య రాజకీయ కథనాల మాటున కనుమరుగైన ఒక ముఖ్యమైన చరిత్రగా వర్ణించవచ్చు. ప్రజలు ప్రేమగా"టైగర్ నరేంద్ర" అని పిలుచుకున్న ఆయనను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా భవిష్యత్తు తరాలకు "టైగర్" నరేంద్ర ఇచ్చే స్ఫూర్తిగా చూడాలి. తన పుట్టిన నేల ఆకాంక్షల కొరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ అంటే నరేంద్ర, నరేంద్ర అంటే బీజేపీ అనే విధంగా ఎదిగి తానే కర్త, కర్మ, క్రియ లా ఉన్న పార్టీ తెలంగాణ పట్ల అనుసరిస్తున్న రాజకీయ వైఖరిని విభేదించి ఆయన బీజేపీ ని విడిచి తెలంగాణ కోసం ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయమే ఆయన రాజకీయ జీవితానికి అసలు ప్రత్యేకతను తెచ్చింది.దాని కోసమే తెలంగాణ సాధన సమితి ఆవిర్భావం. తెలంగాణ ఉద్యమాన్ని ఐక్యంగా నిర్మించడం కోసం టీఆర్ఎస్ లో తన పార్టీని విలీనం చేసి ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేసిన ఘనత వారిది.నరేంద్ర రాజకీయ అనుభవం, ప్రజా పరిచయం, తెలంగాణపై ఆయనకున్న రాజకీయ అవగాహన తెలంగాణ ఉద్యమానికి బలాన్ని చేకూర్చాయి. తను నమ్మిన విలువల కోసం , తెలంగాణ సాధన కోసం కఠినమైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రత్యేక తెలంగాణ లక్ష్యాన్ని మరువని తన వ్యక్తిత్వాన్ని నిరూపిస్తాయి. 1946లో హైదరాబాద్‌లో ఆలె రామలింగం,ఆలె పుష్పవతిల సంతానంగా సాధారణ"పద్మశాలి కుటుంబంలో జన్మించిన ఆలె నరేంద్ర కుటుంబ విలువల నుంచి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి, ఐదు దశాబ్దాల రాజకీయ ప్రయాణంతో తనకంటూ ఒక చరిత్రను నిర్మించుకున్నారు. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయ వాతావరణం ఆయన వ్యక్తిత్వాన్ని మరింత పదునుపెట్టింది. ప్రజలతో నేరుగా కలవడం,సమస్యలపై దూకుడుగా స్పందించడం, రాజకీయ ప్రత్యర్థులను ధైర్యంగా ఎదుర్కోవడం ఆయన స్వభావం. ఆ స్వభావమే ప్రజలు"టైగర్ నరేంద్ర" అని పిలుచుకునేలా చేసింది.టైగర్ నరేంద్ర అనేది ఒక ముద్దుపేరు కాదు. ప్రజల సమస్యలపై ఆయన చూపిన ధైర్యం,రాజకీయ ప్రత్యర్థుల ముందు వెనుకడుగు వేయని నైజానికి ప్రతీక. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల నుంచి ఎదిగి, ఆర్ఎస్ఎస్--జనసంఘ్--బిజెపి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి ఒక ఓటు రెండు రాష్ట్రాలు అనే నినాదాన్ని బీజేపీ నాయకత్వం ద్వారా ఒప్పించి,చెప్పించిన ఘనత ఆయనది. ఐనప్పటికీ 2000 ప్రాంతంలో ప్రత్యేక తెలంగాణ డిమాండ్ మళ్లీ



రాజకీయంగా బలపడుతున్న తరుణంలో, తెలంగాణ రాష్ట్రం కోసం మరింత స్పష్టమైన రాజకీయ పోరాటం అవసరమని ఆలె నరేంద్ర. మనిషి జీవితం ఎంతకాలం సాగిందన్నది అంత ముఖ్యమైనది కాదు; అతను నమ్మిన లక్ష్యం కోసం ఎంత ధైర్యంగా జీవించాడన్నదే ముఖ్యం. ఇన్ని మలుపుల మధ్య ఆయన పేరు ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించింది: "టైగర్ నరేంద్ర." ఆ పేరు వెనుక ఉన్న అసలు అర్థం గర్జన కాదు. భయపడకుండా ముందుకు సాగడం. పదవి పోతుందేమోనని భయపడకుండా నిర్ణయం తీసుకోవడం. విమర్శలు వస్తాయేమోనని వెనక్కి తగ్గకుండా తన అభిప్రాయాన్ని చెప్పడం. రాజకీయ పరిస్థితులు మారినా ప్రజా జీవితాన్ని కొనసాగించడం. అదే ఆయన జీవితంలో నుంచి భవిష్యత్తు తరాలు నేర్చుకోవాల్సిన గొప్ప పాఠం. ఆలె నరేంద్ర లాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని భావితరాలకు మార్గదర్శకంగా ఉండాలని మేధావులు కోరుతున్నారు.

# కుల గౌరవం.. సమాన హక్కులు.. భవిష్యత్ తరాల కోసం పోరుబాట

- డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం
- ప్రభుత్వం, రాజకీయ పార్టీలకు కుల సంఘాల హెచ్చరిక

హైదరాబాద్, /ఆగస్టు 19 /(జన సంఘర్షణ):

కుల గౌరవం, సమాన హక్కులు, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం కుల సంఘాలు ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం త్వరలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కుల సంఘాల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న అంశాలను ఇకపై నిర్లక్ష్యం చేస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

**రాజకీయ పార్టీలకు సూటి హెచ్చరిక..**

రాజకీయ పార్టీలు కుల సంఘాల సమస్యలను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా, అధికారంలో ఉన్నప్పుడు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంఘాల నాయకులు సూచించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాకుండా ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. "కుల గౌరవం కోసం.. సమాన హక్కుల కోసం.. మన భవిష్యత్తు కోసం మా పోరాటం మొదలవుతుంది. మా డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదు" అని సంఘాల ప్రతినిధులు తేల్చిచెప్పారు.

**డిమాండ్లు నెరవేర్చాలి..**

ప్రభుత్వం తక్షణమే స్పందించి కుల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. లేదంటే త్వరలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ ఉద్యమానికి కుల సంఘాలు, ప్రజలు ఐక్యంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇది హెచ్చరిక కాదు.. హక్కుల కోసం ప్రజాస్వామ్య పోరాటానికి పిలుపు. డిమాండ్లు పరిష్కరించాలి.. లేకుంటే ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సిందేనని రాజకీయ వర్గాలకు సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.




# బసవేశ్వర ఆలయ పరిసరాల్లో అక్రమ మొరం తవ్వకాలు?

- అనుమతులు లేకుండానే గుట్టను తవ్వుతున్నారంటూ స్థానికుల ఆరోపణ
- అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్

కోటగిరి/, ఆగస్టు 19/ (జన సంఘర్షణ):

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని రాంపూర్ రోడ్డులో ఉన్న బసవేశ్వర ఆలయ పరిసర ప్రాంతంలోని గుట్టలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టను తవ్వి మొరాన్ని పెద్ద వాహనాల్లో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుట్ట ప్రాంతంలో యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహించడం వల్ల సహజ వనరులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏది?...**

ఆలయ పరిసర ప్రాంతంలోనే తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మొరం తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత మేరకు తవ్వకాలకు అనుమతి ఇచ్చారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని



కోరుతున్నారు. గుట్టను తవ్వి మొరం తరలిస్తున్న వాహనాలపై అధికారులు నిఘా పెట్టి, అనుమతులు లేకుండా తవ్వకాలు.. జరుగుతున్నట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


**అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి...**

సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొన్నారు. అక్రమ మొరం తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉద్యమాన్ని చేపడతామని స్థానికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్లు, గంగారం, చిన్న సాయిలు, పెద్ద సాయిలు, పోశెట్టి, బీమా సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన సమావేశం విజయవంతం

- పెద్ద సంఖ్యలో హాజరైన మున్నూరు కాపు సోదరులు, సోదరీమణులు....
- సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర కన్వీనర్...

హైదరాబాద్,/ ఆగస్టు 19/ (జన సంఘర్షణ):




మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశం విజయవంతమైంది. లక్ష్మీకాపూల్‌లోని రవీంద్రభారతి సమీపంలో మౌంట్ నజీర్ అపార్ట్మెంట్‌లో జరిగిన ఈ సమావేశానికి మున్నూరు కాపు సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో మున్నూరు కాపు సమాజానికి సంబంధించిన పలు అంశాలు, ఆత్మగౌరవ పరిరక్షణ, సమాజ హక్కుల సాధనతో పాటు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించినట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజ ప్రయోజనాల కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. మున్నూరు కాపు సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని సమావేశంలో పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను సమష్టి నిర్ణయంతో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు...**

సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేసిన మున్నూరు కాపు సోదరులు, సోదరీమణులకు మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ ఆత్మగౌరవం, హక్కుల కోసం భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలకు ఇదే విధంగా సహకరించాలని ఆయన కోరారు. మున్నూరు కాపు సమాజ అభ్యున్నతి కోసం అందరూ ఐక్యంగా పనిచేస్తే మరింత బలమైన ఫలితాలు సాధించవచ్చని ఉగ్గే శ్రీనివాస్ పటేల్ పేర్కొన్నారు.

# కూకట్పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

- నిర్వహించిన టీడబ్ల్యుజెఫ్ కూకట్‌పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు.

హైదరాబాద్ సిటీ ప్రతినిధి నాగుల అంజిబాబు, ఆగస్టు 19, (జన సంఘర్షణ):




శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్‌లో కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడబ్ల్యుజెఫ్ కూకట్‌పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను, సమాజంలోని వాస్తవ పరిస్థితులను తమ కెమెరా కళ్లతో ప్రపంచానికి పరిచయం చేస్తూ జర్నలిజంలో విశేష సేవలందిస్తున్న నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ "ఒక చిత్రం కోట్ల మాటలు మాట్లాడుతుంది, వేల ప్రశ్నలను సంధిస్తుంది. లక్షల సమాధానాలకు సమానంగా నిలుస్తుంది" అని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలు సమాజానికి విలువైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పుట్టి నగేష్, టీడబ్ల్యుజెఫ్ కమిటీ సభ్యులు సుజాత, సభ్యులు అనిల్ కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# తుజాల్‌పూర్‌లో ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి చోరీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19, ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా , బీబీపేట్ మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలను చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పుల్లారి లింగం కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం సుమారు 10 గంటలకు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం సుమారు 1 గంటకు ఆయన భార్య, కోడలు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోని బీరువాను కూడా గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి, అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారుఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
20 ఆగస్టు 2026

# హక్కుల కోసం బీసీ కుల సంఘాల సమరశంఖం

- సమాన హక్కులు.. సామాజిక న్యాయం.. ఆత్మగౌరవం కోసం పోరుబాట
- త్వరలో ఆమరణ నిరాహార దీక్షకు బీసీ సంఘాల సన్నద్ధత
- డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం..




**హైదరాబాద్, ఆగస్టు 19 (జన సంఘర్షణ):** సమాన హక్కులు, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం తెలంగాణ బలహీనవర్గాల సమితి ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. తమ హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం త్వరలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. బీసీ కులాలన్నీ ఐక్యంగా నిలిచి తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని నాయకులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీ వర్గాల సమస్యలపై సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**మా హక్కులు.. మా డిమాండ్లు.. నెరవేరాలి**

బీసీ వర్గాల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేవలం హామీలకు పరిమితం కాకుండా సమాన హక్కులు, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. "మా హక్కులు.. మా డిమాండ్లు.. నెరవేరాలి. ఒక్కటే మా నినాదం.. హక్కుల కోసం నిరంతర పోరాటం" అని సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

**అధికార పార్టీకి హెచ్చరిక...**

బీసీ వర్గాల డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘాల నాయకులు అధికార పార్టీని హెచ్చరించారు. బీసీ వర్గాల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం త్వరలో చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షకు బీసీ కుల సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

# సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

- ఏటీఎంఏ ఆధ్వర్యంలో పూర్వ అభ్యసన గుర్తింపు శిక్షణా కార్యక్రమం

**కామారెడ్డి జిల్లా ఆగస్టు 19 (జన సంఘర్షణ) ప్రతినిధి**





సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఏటీఎంఏ ఆధ్వర్యంలో పూర్వ అభ్యసన గుర్తింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమం లో రైతులకు సహజ వ్యవసాయంపై ఇప్పటికే ఉన్న పరిజ్ఞానం, అవగాహనను అంచనా వేయడానికి ప్రాథమిక మూల్యాంకనం నిర్వహించారు అనంతరం శాస్త్రవేత్త ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధనా కేంద్రం, రుద్రూర్ శ్రీ ఏ. కృష్ణ చైతన్య రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ అందించారు. ఈ శిక్షణలో సహజ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, సూత్రాలు, వివిధ సహజ వ్యవసాయ ద్రావణాల తయారీ విధానం, వాటి సరైన వినియోగం మరియు పొలంలో అన్వయించే విధానం గురించి వివరంగా బోధించారు. శిక్షణ పూర్తయిన అనంతరం, కార్యక్రమంలో రైతులు పొందిన అవగాహన మరియు జ్ఞానాన్ని అంచనా వేయడానికి శిక్షణానంతర మూల్యాంకనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి గ్రామ సర్పంచ్ టేక్రియాల లావణ్యరమేష్, ఉప సర్పంచ్ గంగారాం, వార్డు సభ్యులు గుండెల్లి గంగయ్య మరియు ఏ వో ప్రజాపతి, ఏ ఈ ఓ, లు సులోచన, ప్రణీత, సురేందర్ గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొనడంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# దేశ సేవకు విరామం.. స్నేహానికి మరోసారి ఆత్మీయ పలకరింపు

- ఆర్మీ ఉద్యోగి గంగాధర్ ఉద్యోగ విరమణ..
- టెన్త్ క్లాస్ మిత్రుల ఆత్మీయ ఆహ్వానం..







**పోతంగల్, ఆగస్టు 19 (జన సంఘర్షణ):** దేశ రక్షణ కోసం ఎన్నో ఏళ్ల పాటు సైన్యంలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పోతంగల్ మండలానికి చెందిన ఆర్మీ గంగాధర్‌కు టెన్త్ క్లాస్ మిత్రులు అభినందనలు తెలిపారు. దేశ సేవను గర్వంగా పూర్తి చేసి స్వస్థలానికి తిరిగి వచ్చిన గంగాధర్ సేవలను మిత్రులు కొనియాడారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ కుటుంబానికి దూరంగా ఉండి దేశ రక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించిన గంగాధర్‌కు మిత్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

**స్నేహబంధానికి మరోసారి వేదిక...**

ఈ సందర్భంగా గంగాధర్ తన స్వగ్రామమైన హంగర్‌లో ఈ నెల 22వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్న టెన్త్ క్లాస్ మిత్రులందరూ హాజరై తన ఆనందాన్ని పంచుకోవాలని ఆయన కోరారు. చదువుకునే రోజుల్లో ఏర్పడిన స్నేహబంధం కాలం గడిచినా చెక్కుచెదరదని, ఎన్నో ఏళ్ల తర్వాత మిత్రులంతా ఒకే చోట కలుసుకోవడం ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుందని మిత్రులు పేర్కొన్నారు. దేశానికి సేవ చేసిన తమ స్నేహితుడి ఉద్యోగ విరమణ వేడుకను ఆత్మీయంగా జరుపుకోవాలని నిర్ణయించారు.

**దేశ సేవకు సెల్యూట్.. మిత్రత్వానికి జేజేలు...**

దేశానికి సేవ చేసిన ఆర్మీ గంగాధర్‌కు టెన్త్ క్లాస్ మిత్రుల తరఫున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

**దేశ సేవలో గంగాధర్‌కు సెల్యూట్..**

సంవత్సరాలు మారినా మారని స్నేహానికి జేజేలు! ఉద్యోగ విరమణ కార్యక్రమానికి టెన్త్ క్లాస్ మిత్రులందరూ తప్పక హాజరై తమ స్నేహితుడిని అభినందించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్మీయంగా ఆహ్వానించారు.

# బీసీ మహిళలకు 'ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్'

- మహిళా సాధికారత.. స్వయం ఉపాధి.. ఆత్మనిర్భరతే లక్ష్యం

**పోతంగల్,/ ఆగస్టు 19(జన సంఘర్షణ):** బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం'ను అమలు చేయనున్నట్లు తెలిపింది. మహిళలు ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు పేర్కొంది. మహిళా సాధికారత, స్వయం ఉపాధి, ఆత్మనిర్భరతకు ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.


**దరఖాస్తుకు అవసరమైన పత్రాలు...**

పథకం కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

1- పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో.. 2- ఆధార్ కార్డు..3- రేషన్ కార్డు..4- కుటుంబ ధ్రువీకరణ పత్రం..5-ఆదాయ ధ్రువీకరణ పత్రం

**ఇంటి నుంచే ఉపాధి.. మహిళలకు ఆర్థిక భరోసా..**

కుట్టు పనిలో నైపుణ్యం ఉన్న మహిళలు కుట్టు మిషన్‌ను సద్వినియోగం చేసుకుని ఇంటి వద్దనే ఉపాధి పొందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. తద్వారా మహిళల ఆదాయం పెరగడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని తెలిపారు. మహిళలను కేవలం పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళలుగా, ఆర్థికంగా స్వావలంబన సాధించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 'మహిళా సాధికారత.. స్వయం ఉపాధి.. ఆత్మనిర్భరత" అనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులైన బీసీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.







# ప్రజా నాయకురాలు కొండా సురేఖకు ఘన జన్మదిన శుభాకాంక్షలు






- బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి.. పేదల పెన్నిధి..
- తూర్పు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా నాయకురాలిగా అభిమానుల ప్రశంసలు

**హైదరాబాద్,/ ఆగస్టు 19/ (జన సంఘర్షణ):** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. పలు ప్రాంతాల్లో ఆమె అభిమానులు, పార్టీ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి జన్మదిన వేడుకలు జరిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, పేదల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్న ప్రజా నాయకురాలిగా కొండా సురేఖను అభిమానులు కొనియాడారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా తూర్పు ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ ప్రజల ఆకాంక్షలకు.. అనుగుణంగా పనిచేస్తున్న నాయకురాలిగా ఆమెకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని అభిమానులు తెలిపారు. పేదలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొండా సురేఖకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.. తెలియజేస్తూ, ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, మరెన్నో సంవత్సరాలు ప్రజా సేవలో కొనసాగాలని అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co